సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



పరిటాల నుంచి ప్రాణహాని

పరిటాల కుటుంబం నుంచి తనకు ప్రాణహాని ఉందని రామగిరి వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ అన్నారు. 8లో



డైట్‌సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

డైట్‌సెట్- 2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. రెండేళ్ల డీఎడ్ కోర్సు చేసేందుకు ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
44.1°/26.5°

జిల్లా వ్యాప్తంగా సోమవారం భానుడు మండిపోయాడు. తీవ్ర ఉక్కపోత, వడగాల్పులు నెలకొన్నాయి. 10 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీడీపీకి రెబల్స్ బెడద

- హిందూపురంలో పరిపూర్ణానందస్వామి
- రాప్తాడు నుంచి సాకే రాజేశ్‌కుమార్

సాక్షి, పుట్టపర్తి: హిందూపురం పార్లమెంటు పరిధిలో టీడీపీకి రెబల్స్ బెడద వెంటాడుతోంది. హిందూపురంలో నందమూరి బాలకృష్ణకు.. రాప్తాడులో పరిటాల సునీతకు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత మొదలైంది. ఆరంభం నుంచి రాప్తాడు టికెట్ ఆశించిన సాకే రాజేశ్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అధిష్టానం నచ్చజెప్పినా.. తనకు పోటీగా టికెట్ తెచ్చుకున్న పరిటాల సునీత ఓటమే లక్ష్యమని నినదిస్తూ సాకే రాజేశ్‌కుమార్ (ప్రొఫెసర్ రాజేశ్) బరిలో నిలిచారు. ఎన్నికల సంఘం ఆయనకు స్విచ్ బోర్డు గుర్తు కేటాయించింది. హిందూపురం పార్లమెంటు సీటు ఆశించి భంగపడ్డ బీజేపీ నేత, ఆధ్యాత్మిక గురువు పరిపూర్ణానందస్వామి స్వతంత్ర అభ్యర్థిగా హిందూపురం అసెంబ్లీ బరిలో నిలిచారు. తనకు టికెట్ రాకుండా అడ్డుపడిన వారి ఓటమే లక్ష్యంగా బరిలో ఉంటానని చెబుతున్నారు. హిందూపురం పార్లమెంటు సీటుకు కూడా నామినేషన్ దాఖలు చేయగా.. సరిగా లేనందున తిరస్కరించిన సంగతి తెలిసిందే. హిందూపురం అసెంబ్లీ స్థానానికి టీడీపీ రెబల్‌గా బరిలో నిలిచిన పరిపూర్ణానందస్వామికి ఎన్నికల సంఘం అగ్గిపెట్టె గుర్తు కేటాయించింది.

ప్రలోభాలకు లొంగిన 'తమ్ముళ్లు'

చంద్రబాబు – నారా లోకేశ్‌లపై నిన్న మొన్నటి వరకు నిప్పులు చెరిగిన 'తమ్ముళ్లు' ప్రలోభాలకు లొంగిపోయారు. మడకశిర నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆయన తనయుడు డాక్టర్ సునిల్‌కుమార్ పోటీ నుంచి తప్పుకొన్నారు. అదేవిధంగా పుట్టపర్తి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సిమెంట్ పోలన్న.. తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. చంద్రబాబు సూచన మేరకు స్థానిక టీడీపీ నేతలు బుజ్జగించి డబ్బు ఆశ చూపడంతోనే పోటీ నుంచి తప్పుకొన్నారని సమాచారం. ఇన్నాళ్లు టీడీపీని తిట్టిన నాయకులు.. నేడు అదే పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొంటే.. మరింత నష్టం జరగక తప్పదని టీడీపీ నేతలే చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్ : పోలింగ్ కేంద్రాలు, ఈవీఎం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణ సమీపంలో బిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని, అక్కడి పరిసరాలు, ఏర్పాటు చేసిన గార్డ్‌లు, సీసీ కెమెరాల పనితీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అక్కడి నుంచి రహమత్‌పూర్, కొట్నూరు, మోడల్‌కాలనీ, ఎంజీఎం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు చూసి అక్కడ ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపుపై ఆరా తీశారు.

ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాలైన కొడికొండ చెక్‌పోస్టు, తూమకుంట చెక్‌పోస్టును ఎస్పీ మాధవరెడ్డి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పోలీస్, సెబ్ ఇతర శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్నీ క్షుణంగా తనిఖీ చేయాలని మద్యం, మత్తు పదార్థాలు, గిఫ్టులు, నగదు రాష్ట్రంలోకి రాకుండా చూడాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజాక్షన్, సీఐలు శ్రీనివాసులు, రియాజ్ అహమ్మద్, ఈరన్న, వై.శ్రీనివాసులు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గంగపూజకు పోటెత్తిన మహిళలు



పాలబావిలో గంగ పూజ చేస్తున్న మహిళలు

రొళ్ల: రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పాలబావిలో గంగపూజకు మహిళలు పోటెత్తారు. తెల్లవారుజామునే మహిళలు చన్నీటి స్నానమాచరించి నియమనిష్టలతో తడి దుస్తులతోనే పాల బావి వద్దకు చేరుకుని గంగపూజ చేశారు. గంగపూజ చేస్తే యువతులకు కళ్యాణయోగం, పిల్లలు లేని వారికి సంతాన భాగ్యం, దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్యయోగం కలుగుతుందని భక్తుల నమ్మకం. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు గజ ఈతగాళ్లతో పర్యవేక్షించారు. కార్యక్రమంలో రత్నగిరి సంస్థానం రాజవంశీకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కబ్జాల కందికుంట





కందికుంట అనుచరుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న అమీర్‌ఖాన్ (ఫైల్)

- రూ.20 కోట్లు విలువ చేసే ముస్లింల స్థలం కబ్జా
- ప్రశ్నించిన బాధితులపై కందికుంట అనుచరుల దాడి

కదిరి: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేరు వినగానే కదిరి నియోజకవర్గ ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఆయన కన్ను పడితే విలువైన స్థలాలు, పొలాలు కబ్జా కావాల్సిందేనన్న విమర్శలు ఉన్నాయి. బాధితుల్లో ఎంతోమంది ముస్లింలు, ఇతర సామాజిక వర్గం వారు ఉన్నారు. కబ్జాలను ఎవరైనా ప్రశ్నిస్తే అనుచరులతో దాడులు, దౌర్జన్యాలు చేయించడం ఆయన నైజంగా ఉంది. ప్రజాకంటకుడిగా ఉన్న ఈయనకే ప్రతి ఎన్నికల్లో టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తుండటం చర్చనీయాంశంగా మారుతోంది. మీడియా ముందు మాత్రం కందికుంట నీతి సూక్తులు చెబుతుండడం చూసి ప్రజలు చీదరించుకుంటున్నారు.

బొరుగులమ్మి సంపాదించిన స్థలం..

కదిరి పట్టణంలోని జామియా మసీదు వీధికి చెందిన పి.ఖాజామొద్దీన్ అలియాస్ బొరుగుల ఖాజా కొన్నేళ్ల క్రితం ఊరూరా తిరిగి బొరుగులు అమ్మేవాడు. ఈ వ్యాపారంలో సంపాదించిన డబ్బుతో కదిరి–హిందూపురం రోడ్‌లో అప్పట్లో సర్వే నంబరు 70/3–3లో 4.50 ఎకరాల పొలం కొన్నాడు. కుటుంబ అవసరాల కోసం అందులో 1.50 ఎకరాలు అమ్మేయగా.. మూడెకరాలు అలానే ఉంది. ఖాజామొద్దీన్‌కు ఐదుగురు సంతానం. ఆయన మరణానంతరం ఆ పొలాన్ని కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా సాగుచేస్తూ వచ్చారు. ఆడ పిల్లలందరూ పెళ్లీడుకు రావడంతో వారికి పెళ్లి చేసేందుకు ఆ మూడెకరాల భూమిని అమ్మాలని కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు.

డబ్బు చెల్లించకుండానే ఇతరులకు రిజిస్ట్రేషన్

ఆ భూమిని అమ్ముతారనే విషయం తన అనుచరుల ద్వారా కందికుంటకు తెలిసింది. వెంటనే వారిని పిలిపించి సెంటు రూ.80 వేల చొప్పున బేరం కుదుర్చుకొని వెంటనే రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చారు. తర్వాత ఆ మిగిలిన డబ్బు ఇచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోండని ఖాజామొద్దీన్ కుటుంబ సభ్యులు కందికుంట ఇంటి దగ్గర వేచి ఉండటం దినచర్యగా మారింది. కొన్ని రోజులు గడిచాక ఓ రోజు 'ఆ భూమితో మీకు ఎలాంటి సంబంధమూ లేదు. ఆ భూమి మాది. ఇదిగో మా బంధువుల పేరు మీద ఆ భూమికి సంబంధించి కదిరి రెవెన్యూ వారు మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకం' అంటూ కందికుంట తెలపడంతో వారికి గుండె ఆగినంత పనైంది. ప్రశ్నించే ధైర్యం లేక, తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఇంటి దారి పట్టక తప్పలేదు. ప్రస్తుతం ఆ భూమి విలువ రూ.20 కోట్లు చేస్తుంది.

బాధిత యువకుడిపై హత్యాయత్నం

ఖాజామొద్దీన్ మనవడు అమీర్‌ఖాన్ 2018 జూలై 14న జేసీబీని తీసుకెళ్లి పొలం చదును చేయిస్తున్నాడు. ఈ విషయం కందికుంటకు తెలిసి వెంటనే తన అనుచరులను అక్కడికి పంపి ఆ యువకుడిపై రాళ్ల దాడి చేయించాడు. గుండెలపై బండ రాళ్లతో కొట్టి చంపడానికి కూడా ప్రయత్నించారు. ఈలోగా వారి కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి ఏడుస్తుంటే జనం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని బాధితుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఆరోజు నుంచి ఈరోజు వరకు ఆ స్థలం వైపు బాధితులు కన్నెత్తి చూడటానికి కూడా భయపడుతున్నారు. కందికుంట మాత్రం ఆ స్థలం తమదేనని బుకాయించడంతో పాటు మీడియా ముందు తాను సచ్ఛీలుడినంటూ నీతి సూక్తులు వల్లిస్తున్నాడు.

చిత్తుగా ఓడించండి

అమాయక ప్రజల భూమిని ఆక్రమించి, దానికి తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి అందులోకి ఇతరులెవ్వరూ ప్రవేశించకుండా కందికుంట ప్రస్తుతం దానికి పెద్ద గేట్ కూడా ఏర్పాటు చేయించాడు. ఆ స్థలం యజమానులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులే కాకుండా ఆ దారిగుండా వెళ్లే ప్రతి ఒక్కరూ కందికుంటకు శాపనార్థాలు పెడుతున్నారు. ఇలాంటి వ్యక్తికి చంద్రబాబు ప్రతిసారీ ఎందుకు టికెట్ ఇస్తున్నాడో అర్థం కావడం లేదని జనం తప్పుబడుతున్నారు. పేదల స్థలాలు కబ్జా చేసే కందికుంటను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

అసెంబ్లీ బరిలో 91 మంది

- పార్లమెంటు బరిలో 13 మంది
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ



నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న అభ్యర్థి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదల చేయగా 25 వరకు నామినేషన్లు స్వీకరించారు. జిల్లాలో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్లు స్వీకరించారు. పార్లమెంట్‌కు 40, అసెంబ్లీ స్థానాలకు 231 నామినేషన్లు స్వీకరించారు. ఇందులో పరిశీలనలో 54 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. సోమవారం అన్ని ఆర్‌ఓ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో గట్టి పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో రాప్తాడులో 2, మడకశిరలో 3, పెనుకొండలో 1, పుట్టపర్తిలో 1 ఉండగా హిందూపురం అసెంబ్లీ, ధర్మవరం, కదిరిలో ఎవరూ ఉపసంహరించుకోలేదు. దీంతో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో 91 మంది అభ్యర్థులు, హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గంలో ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోగా బరిలో 13 మంది ఉన్నారు.

పుట్టపర్తి, ధర్మవరంలో అత్యధికం..

బరిలో ఉన్న అభ్యర్థుల్లో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లో అత్యధికంగా 15 మంది చొప్పున ఉన్నారు. రాప్తాడు, మడకశిర, హిందూపురం, కదిరి అసెంబ్లీ నియోజక వర్గాల్లో 13 మంది చొప్పున బరిలో ఉన్నారు. పెనుకొండలో 9 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం మీద స్వతంత్ర అభ్యర్థులుగా 48 మంది పోటీలో ఉండడం విశేషం.

సవిత అఫిడవిట్ తప్పులతడక



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- నేరచరిత గురించి పొందుపరచలేదు
- ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తా
- మీడియాతో మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగాను, అసంపూర్తిగాను ఉందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కె.వి.ఉషశ్రీచరణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పలు కేసుల గురించి అఫిడవిట్‌లో ఆమె పొందుపరచకపోవడంపై తాను హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. సోమవారం సాయంత్రం పెనుకొండలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి శాంతమ్మతో కలిసి మంత్రి ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ చట్టం కింద ఉన్న కేసులను సవిత పొందుపరచలేదన్నారు. ఆస్తికి సంబంధించి తల్లి చేసిన ఆరోపణల గురించి కేసులో ఉన్నాయని, అఫిడవిట్‌లో ఆ ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ఇక సొంత ఒదినకు ఆస్తి పంపకాల్లో న్యాయం చేయకుండా మానసికంగాను, శారీరకంగాను హింసించినట్లు 2012లో నమోదైన కేసు వివరాలనూ సవిత అఫిడవిట్‌లో చూపలేదన్నారు. దీనిపై ఆర్‌ఓ వద్ద అప్పీల్ చేసినట్లు చెప్పారు. హైకోర్టు దృష్టికి కూడా తీసుకుపోతానన్నారు. గతంలో నమోదైన క్రిమినల్ కేసులనూ చూపలేదని, దీనిపైనా న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

సవిత నేరచరితపై ఓటర్లు ఆలోచించాలి..

పెనుకొండ నియోజకవర్గ ప్రజలందరూ టీడీపీ అభ్యర్థి సవిత నేరచరితపై ఆలోచించాలని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. లోకల్ అని చెప్పుకునే సవితపై కదిరి, లేపాక్షి, బెంగళూరు, రాప్తాడు, పెనుకొండ, రొద్దంలో కేసులు ఉన్నాయని, వీటిని బట్టి చూస్తే ఆమె ఏ ప్రాంతానికి చెందినదో అర్థంకాని పరిస్థితి అని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారని విమర్శలు చేయడమే తప్ప ఆధారాలేవీ లేవన్నారు. సవిత మాత్రం ప్రభుత్వానికి సంబంధించిన మట్టిని తరలిస్తుండగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సవితపై ఫోర్జరీ, చీటింగ్ కేసు ఉందన్నారు. ఏ పదవీ లేకున్నా ఇన్ని ఫోర్జరీలు, మోసాలు చేసిందంటే.. ఎన్నికల్లో గెలిపిస్తే ఇంకెంత చెలరేగిపోతుందో నియోజకవర్గ ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు.

- అఫిడవిట్‌లో శ్రీచరణ్ భార్య ఉషశ్రీ అని తాను ధైర్యంగా పెట్టుకున్నానని, కుటుంబ సభ్యుల పేర్లు పెట్టుకున్నానని చెప్పారు. కానీ సవిత తన అఫిడవిట్‌లో అన్నింటికీ ఖాళీలు పెట్టుకుందని, తండ్రి రామచంద్రారెడ్డి అని పొందుపరిచిందని, దీన్ని ప్రజలు గమనించాలని సూచించారు. సొంత కుటుంబ సభ్యులనే సరిగా చూసుకోలేని సవిత.. ప్రజలకు ఏమి చేస్తుందని ప్రశ్నించారు. తాను ఉన్నది ఉన్నట్లు చెప్పే మనిషని, తనపై మోడల్ ఆఫ్ కాండక్ట్ కింద రెండు సాదాసీదా కేసులు నమోదయ్యాయని చెప్పారు. మంత్రిగా ఉన్న తాను రాయలసీమలో ఏ స్థానం నుంచైనా పోటీ చేసే హక్కు ఉందన్నారు. పెనుకొండ నియోజక వర్గ ప్రజలకు సేవ చేయడానికి తాను ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. లోకల్– నాన్ లోకల్ అనేది కాకుండా ప్రజలకు ఎవరు సేవ చేగలరో గుర్తించాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడంతో పాటు నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. లీగల్‌సెల్ అడ్వైజర్ ఉమాపతి, న్యాయవాది నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సవితమ్మపై కేసులు నమోదు కావడం ఆశ్చర్యం వేస్తోందన్నారు. కులాలు, బంధుత్వాలను కలుపుకోవడం కోసం సవిత 'లోకల్' కార్డు ఉపయోగిస్తోందని విమర్శించారు.

పెరిగిన 'ఫ్యాను' గాలి

- సీఎం జగన్ పర్యటనల తర్వాత మరింత ఊపు
- పెద్ద సంఖ్యలో చేరికలతో వైఎస్సార్ సీపీలో జోష్
- ముఖ్య నాయకులు వీడడంతో టీడీపీ అభ్యర్థుల డీలా



తాడిపత్రిలో ఆదివారం జరిగిన రోడ్ షోలో ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సీఎం వైఎస్ జగన్ వరుస పర్యటనలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఆయన నిర్వహించిన పలు సభలు, యాత్రలతో కేడర్‌లోకి మరింత సానుకూల సంకేతాలు వెళ్లాయి. పార్టీ అధినేత పిలుపుతో ఉత్తేజితులవుతున్న నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా ఎన్నికల కదనరంగంలో కదం తొక్కుతున్నారు. ప్రతిపక్ష టీడీపీకి గుక్కతిప్పుకోలేనట్టుగా చేస్తున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది.

'అనంత'పై ప్రత్యేక అభిమానం

ఉమ్మడి అనంతపురం జిల్లాపై ప్రత్యేక అభిమానముందని తన పర్యటనల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చాటుకున్నారు. గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి హోదాలో ఆయన ఏడు నియోజక వర్గాల్లో నేరుగా పర్యటించారు. వివిధ ప్రభుత్వ పథకాల సొమ్మును బటన్ నొక్కి విడుదల చేశారు. రాయదుర్గం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, రాప్తాడు, ఉరవకొండ తదితర నియోజకవర్గాల్లో నిర్వహించిన సీఎం సభలకు విశేష స్పందన లభించింది. రైతులు, మహిళలు, విద్యార్థులు పోటెత్తారు. జననేతను అక్కున చేర్చుకున్నారు. ఈ విషయం కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బాగా కలిసివచ్చిందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోందని స్పష్టం చేస్తున్నారు.

రాప్తాడు సభతోనే ఉత్తేజం

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కూడా ఉమ్మడి జిల్లాకు పలు సార్లు సీఎం వచ్చారు. శంఖారావం పూరించిన అనంతరం ఫిబ్రవరి 18న రాప్తాడు నియోజకవర్గంలో 'సిద్ధం' సభ ఏర్పాటు చేశారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది ఈ సభకు హాజరయ్యారు. జాతీయ మీడియా సైతం ఈ సభను అతిపెద్ద బహిరంగ సమావేశంగా అభివర్ణించింది. సభలో వైఎస్ జగన్ చేసిన ప్రసంగం శ్రేణులను ఎంతగానో ఉత్తేజపరిచింది.

బస్సు యాత్రలతో ఊపు..
తాడిపత్రి సభతో టాపు

'సిద్ధం' సభల అనంతరం బస్సు యాత్రగా జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ వెంటే మరింత ఊపు తీసుకొచ్చారు. సీఎం వస్తున్నాడన్న వార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులే కాకుండా సాధారణ ప్రజలు ఆయనను చూసేందుకు తరలివచ్చారు. రోడ్లపై గంటల తరబడి నిల్చుని అభిమాన నేతను చూశాకే ఇంటికెళ్లారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి మొదలు కదిరి వరకూ నీరా'జనం' పలికారు. సీఎం జగన్‌పై తమ అభిమానం చాటుకున్నారు.

- బస్సు యాత్ర వెళ్లని నియోజకవర్గాల్లో ఎన్నికల సభలు నిర్వహించాలని నిర్ణయించిన సీఎం జగన్.. అందులో భాగంగా రెండు రోజుల క్రితం తాడిపత్రిలో నిర్వహించిన సభ జన సునామీని తలపించింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా జగన్ రాక కోసం కార్యకర్తలు, అభిమానులు వేచి చూశారు. మేనిఫెస్టో ప్రకటించిన అనంతరం సీఎం పాల్గొన్న ఈ సభ కార్యకర్తల్లో మరింత ఉత్తేజాన్నిచ్చింది.

కీలక నేతల చేరికతో మరింత జోష్..

వైఎస్ జగన్ బస్సు యాత్ర, ఎన్నికల సభల్లో టీడీపీ నేతలు, ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు చాంద్ బాషా, నాగరాజారెడ్డి, పుట్టపర్తి టీడీపీ అభ్యర్థిగా చివరి వరకూ రేసులో ఉన్న రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే, టీడీపీ కురుబ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బుల్లె శివబాలతో పాటు రెండు వందల మందికి పైగా నాయకులు పార్టీలో చేరడం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది.

టీడీపీలో కలవరపాటు

ఇప్పటికే తమ ప్రచారాలకు జనం కరువై అల్లాడుతున్న టీడీపీ అభ్యర్థులకు ఈ పరిణామాలు మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. చంద్రబాబుకు రూ. కోట్లకు కోట్లు సమర్పించుకుని సీట్లు తెచ్చుకుంటే.. ఇప్పుడిలా అవుతోందేంటని లోలోనే మదనపడుతున్నట్లు తెలిసింది.

ధర్మవరంలో కార్పొరేట్ పాలిటిక్స్

- ఇతర ప్రాంతాల వ్యక్తులతో ప్రలోభాలకు తెరలేపిన బీజేపీ అభ్యర్థి
- డబ్బును ఎరచూపుతూ అధికార పార్టీ నాయకుల కొనుగోలు
- సీబీఐ, ఈడీ దాడుల పేరుతో వ్యాపారులకు బెదిరింపులు
- కొత్త సంస్కృతిని చూసి ధర్మవరం ప్రజల విస్మయం

ధర్మవరం నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కార్పొరేట్ రాజకీయం రంగ ప్రవేశం చేసింది. ఢిల్లీ నుంచి వచ్చానన్న బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ఇక్కడ గల్లీలో ప్రలోభాలు, బెదిరింపులతో నీచరాజకీయాలు చేస్తున్నారు. రూ.కోట్లు కుమ్మరించి అధికార పార్టీ నాయకులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తనకు మద్దతు ఇవ్వని వ్యాపారులపై సీబీఐ, ఐటీ, ఈడీలతో దాడులు చేయిస్తానంటూ తన వర్గీయుల ద్వారా బెదిరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ధర్మవరం: ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగప్రవేశం చేయగానే ధర్మవరంలో కొత్త సంస్కృతి మొదలైంది. ఆయనకు మద్దతుగా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి రెండు వేల మందికిపైగా ధర్మవరంలో దిగారు. పట్టణంలోని అద్దె ఇళ్లు, లాడ్జీలలో తిష్ట వేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రలోభాలకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారు. డబ్బు ఇస్తామని, నామినేటెడ్ పదవులు, సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని.. ఇలా పలు రకాలుగా ప్రలోభపెడుతున్నారు. గ్రామస్థాయి నాయకుడికైతే రూ.10 లక్షలు, ఓ మోస్తరు నాయకుడికైతే అంతకన్నా ఎక్కువ ఇస్తామని చెబుతున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు గిర్రాజు నగేశ్, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి బాబు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌లను పెద్దఎత్తున ప్రలోభపెట్టి సత్యకుమార్ సమక్షంలో బీజేపీలో చేర్చుకున్నట్లు సమాచారం. వీరివెంట భారీగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వస్తారని భావించినప్పటికీ వారి అంచనాలు తలకిందులయ్యాయి. వంద మందితో పార్టీలో చేరుతానని చెప్పిన గిర్రాజు నగేశ్ కనీసం పది మందికి కూడా కండువా కప్పించలేకపోయాడు. కోటిబాబు వెంట కూడా ఎవరూ వెళ్లలేదు. కోటిబాబు బీజేపీలోకి చేరిన మరుసటి రోజే ఆయన సోదరులు మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరడం విశేషం. అదేవిధంగా తమ ప్రలోభాలకు లొంగని వారిని సీబీఐ, ఈడీ, ఐటీ దాడుల పేరిట సత్యకుమార్ మనుషులు బెదిరిస్తున్నట్లు తెలిసింది. పట్టు–చేనేత వస్త్ర వ్యాపారానికి కేంద్రమైన ధర్మవరంలో వ్యాపారులకు ఈ తరహా బెదిరింపులు ఎక్కువైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, సత్యకుమార్ ప్రచారానికి కూడా ఇతర ప్రాంతాల నుంచి డబ్బులు ఇచ్చి జనాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ఆయన నామినేషన్ కార్యక్రమానికి కూడా ప్రొద్దుటూరు, కర్నూలు, రాప్తాడు తదితర ప్రాంతాల నుంచి డబ్బులు ఇచ్చి వాహనాల్లో జనాలను తీసుకురాగా, వారు మధ్యలోనే వెళ్లిపోయారు.

బీజేపీపై చేనేతల ఆగ్రహం..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ విధించడంతో నేతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. జీఎస్టీ రద్దు చేయాలని నేతన్నలు నిరసన తెలిపినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా గత కేంద్ర బడ్జెట్‌లో జీఎస్టీ 5 నుంచి 12 శాతానికి పెంచాలని భావించింది. అప్పట్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌లు కేంద్ర ఆర్థికమంత్రిని కలిసి చేనేత వస్త్రాలపై జీఎస్టీని పెంచడం వల్ల కలిగే నష్టాలను వివరించడంతో 5 శాతానికే పరిమితం చేశారు. ఈ క్రమంలో బీజేపీపై నేతన్నలు, వ్యాపారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.



క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి


ప్రహ్లాద మృతదేహం

రొద్దం: మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన ప్రహ్లాద (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఆదివారం రాత్రి వెంకటాపురం గ్రామానికి వెళ్లిన ప్రహ్లాద అదే గ్రామ శివారులో ఆంధ్ర సరిహద్దున సోమవారం మృతదేహమై కనిపించాడు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. శరీరంపై రక్తగాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బాషావలి తెలిపారు.

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య


ఉపేంద్ర (ఫైల్)

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమ ఎస్ఎల్ఏపీ కంపెనీలో పనిచేస్తున్న ఉపేంద్ర (22) ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఉపేంద్ర కొంత కాలంగా గోరంట్లలోని బస్టాండ్ సమీపంలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటూ ఎస్ఎల్ఏపీ కంపెనీలో పని చేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున తన సహోద్యోగి నిద్రలో ఉన్న సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సహోద్యోగి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నవతరం పార్టీ అభ్యర్థికి గ్లాస్ గుర్తు



కనగానపల్లి: రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నవతరం పార్టీ తరఫున పోటీ చేస్తున్న బి.నరేష్‌కు ఎన్నికల అధికారులు గ్లాస్ గుర్తు కేటాయించారు. ఈ గుర్తు జనసేన పార్టీకి కేటాయించిన విషయం తెలిసిందే. రాప్తాడు అసెంబ్లీ నుంచి జనసేన పార్టీ తరఫున ఎవరూ బరిలో లేకపోవడంతో నవతరం అభ్యర్థికి కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

కార్మికులకు రక్షణ కల్పించండి

పుట్టపర్తి అర్బన్: వివిధ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు వేడి గాలుల నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత యాజమాన్యాలను జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సూర్యనారాయణ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 44 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రస్తుత తరుణంలో వేడి గాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీల యజమానులు, అసంఘటిత రంగాల్లోని కార్మికులు వేడి గాలుల నుంచి ఉపశమనం పొందేలా చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు తదితరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఆరుబయట పని చేసే కార్మికులకు నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఊపందుకున్న ప్రచారం

నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మిగిలిన పార్టీల అభ్యర్థుల కంటే ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఇప్పటికే వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య తిరిగిన అభ్యర్థులు తాజాగా ఎన్నికల నేపథ్యంలో మరోసారి ప్రజల వద్దకు చేరుకోవడంతో విశేష ఆదరణ లభిస్తోంది. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామంటూ ప్రజలకు అభ్యర్థులు పిలుపునిస్తున్నారు.

– సాక్షి బృందం, పుట్టపర్తి:

ప్రచార హోరు


పెనుకొండ మండలం రాంపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కేవీ ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మ


ధర్మవరంలోని నేసేపేటలో ఓటు అభ్యర్థిస్తున్న కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి


మడకశిర నియోజకవర్గం గుండుమలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఈరలక్కప్ప


కదిరిలోని ఎర్రగుంటపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న బీఎస్ మక్బూల్

రేపటి నుంచి పింఛన్ పంపిణీ


పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ పంపిణీ అంశంపై సచివాలయ సిబ్బందితో సమావేశమైన అధికారులు

- జిల్లాలో 72,911 మందికి ఇంటికే పింఛన్
- 1,97,896 మందికి బ్యాంకు ఖాతాలకు జమ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత ఫించన్లు అందుకునే అవ్వాతాతలు ప్రతిపక్షాల కుట్రల కారణంతో తీవ్ర ఇబ్బందులు పడేపరిస్థితి దాపురించింది. మే ఒకటో తేదీన జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛన్ పంపిణీ చేయనున్నారు. ఇందులో బ్యాంకు ఖాతాలు లేని వారికి, అనారోగ్యాలతో మంచానికే పరిమితమైన వారికి మాత్రం ఇంటికే వెళ్లి నగదు పంపిణీ చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. మూడు రోజుల్లో వంద శాతం పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఆయా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నెల 30న ఆయా మండలాల్లో బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసి ఇంటికే పింఛన్ అందజేసే లబ్ధిదారుల కోసం ఏర్పాట్లు చేసింది.

- జిల్లాలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 2,72,807 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం మే నెలకు సంబంధించి రూ.81.21 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో 72,911 మంది మంచం పట్టిన రోగులు, నడవలేని దివ్యాంగులు, అమర జవానుల భార్యలు, అనారోగ్య కారణాలతో పింఛన్లు పొందుతున్న వారికి ఇంటి వద్దకే అందజేస్తుంది. ఇందు కోసం రూ.21.45 కోట్ల నిధులు డ్రా చేయనున్నారు. ఇక ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమం ఒకటో తేదీ ఉదయం నుంచే మొదలవుతుంది. నగదు జమ కాగానే లబ్ధిదారులకు ఎస్ఎంఎస్ ద్వారా సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ వెంటనే ఏటీఎం, క్యాష్ పాయింట్, బ్యాంకుల ద్వారా డ్రా చేసుకోవచ్చు. జిల్లాలో 1,97,896 మందికి రూ.59.76 కోట్ల నగదు బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. మే నెలతో పాటు జూన్ నెల పింఛన్ పంపిణీకీ ఇదే విధానం అమలు చేయనున్నారు. కాగా ఎవరికి పింఛన్ డబ్బు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.. ఎవరికి ఇంటి వద్ద పంపిణీ చేస్తారు తదితర వివరాలతో కూడిన జాబితాలను మంగళవారం సచివాలయ నోటీస్ బోర్డుల్లో ఉంచుతారు.

సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు

జిల్లాలోని 32 మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో ఉన్న సచివాలయాల సిబ్బందితో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్హులైన పింఛన్ లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, ఇంటింటికీ పింఛన్ పంపిణీ ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాలు 544 ఉండగా అందులోని సిబ్బంది పింఛన్ పంపిణీకి చర్యలు చేపట్టనున్నారు.

జగనన్న వెంటే గిరిజనులు

- టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్


మాట్లాడుతున్న అశ్వత్థనాయక్

పెనుకొండ: తండాల అభివృద్ధితో పాటు గిరిజనుల అభ్యున్నతికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులంతా అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో మంచి చేసే నాయకుడికి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని టీటీడీ బోర్డు సభ్యులు అశ్వత్థనాయక్ పిలుపునిచ్చారు. పెనుకొండ మండలం మంగాపురంలో పలు గిరిజన కుటుంబాలను సోమవారం ఆయన కలసి జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు భాస్కర్‌నాయక్, శివశంకర్‌నాయక్, విశ్రాంత సీఐ రామచంద్రనాయక్, సుధాకర్, శ్రీధర్‌తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రతి తండాలోనూ తాను పర్యటించినప్పుడు అందరూ ముక్తకంఠంతో తామంతా జగనన్న వెంటేనని నినదించారన్నారు. గత ప్రభుత్వాలు తండాల అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతనే తండాల అభివృద్ధి మొదలయిందన్నారు. రాజకీయాల్లోనూ గిరిజనులకు సరైన ప్రాధాన్యత దక్కుతోందన్నారు. అవినీతి రహిత ప్రభుత్వం నడిపిన జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అలాంటి నాయకున్ని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడం అందరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

ఉత్సాహంగా గాడిదల రేస్


గాడిదల రేస్‌లో దూసుకెళుతున్న రైడర్లు

వజ్రకరూరు: మండల కేంద్రంలో వెలసిన జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో గాడిదల రేస్ నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గాడిదలను యజమానులు తీసుకువచ్చారు. పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వజ్రకరూరు జనసంద్రమైంది. ఉదయం జరిగిన గాడిదల పరుగు పందెంలో రైడర్ రాయదుర్గం మండలం మురడి గ్రామానికి చెందిన తిప్పయ్య ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన రైడర్ మల్లేష్ రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. అనంతరం గెలుపొందిన గాడిదలకు పూలహారాలు వేసి ఊరేగించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు గురుమూర్తి, సురేష్, సునీల్, సుంకప్ప, మనోహర్, ధనుంజయ, గుండాలసుధ, శీనా తదితరులు పాల్గొన్నారు.

పరిటాల కుటుంబం నుంచి ప్రాణహాని

- ఎస్పీని కలిసిన వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పరిటాల కుటుంబం నుంచి తనకు ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని ఎస్పీ మాధవరెడ్డిని రామగిరి వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ కోరారు. సోమవారం పుట్టపర్తిలోని పోలీస్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డితో కలసి ఆయన ఎస్పీని కలసి వినతిపత్రం అందజేశారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో తాను వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యానన్నారు. పరిటాల కుటుంబ ప్రలోభాలకు తలొగ్గి ఇటీవల టీడీపీలో చేరానన్నారు. అయితే ఆ పార్టీ భావజాలం నచ్చక తాను తిరిగి తోపుదుర్తి సోదరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. ఇది జీర్ణించుకోలేక తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కార్లపై రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడి వర్గ కక్షలకు ఆజ్యం పోస్తున్నారన్నారు. తనకు, కుటుంబ సభ్యులకు పరిటాల కుటుంబం నుంచి తగిన రక్షణ కల్పించాలని కోరారు.

వన్నూరుస్వామిపై దాడి అవాస్తవం

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలో వన్నూరు స్వామి అనే వ్యక్తిపై భౌతిక దాడి జరిగిందనే అంశం అవాస్తవమని ఆ గ్రామస్తులు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి తోపుదుర్తి గ్రామానికి చెందిన పలువురు ఎస్పీ అమిత్ బర్దర్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి విషయాన్ని వివరించారు. రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం అరాచకాలను ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ ప్రజలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వైపు ఆకర్షితులయ్యారన్నారు. ఈ ప్రజాదరణను చూసి ఓర్వలేక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పరిటాల కుటుంబం మళ్లీ అలజడులకు తెరలేపిందన్నారు. ఈ క్రమంలోనే వన్నూరప్పను సైతం ప్రలోభాలకు గురి చేసి కేసులు పెట్టించే ప్రయత్నం చేశారని వివరించారు. గ్రామస్తులు ఓబులేసు, శాంతమ్మ, కొండన్న మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని తోపుదుర్తి కుటుంబసభ్యులు చెప్పారని, అయితే గ్రామంలో ఎవరినీ వారు బెదిరించలేదని తెలిపారు. వన్నూరుస్వామి వెనుక పరిటాల కుటుంబం ఉండి అనవసర రాద్ధాంతానికి తెరలేపిందని మండిపడ్డారు.

సింహ వాహనంపై చౌడేశ్వరి అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఉత్సవ మూర్తి

అమడగూరు: భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న అమడగూరు చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింహ వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవానికి ఉభయదారులుగా కొలిమిరాళ్లపల్లికి చెందిన జెడ్పీటీసీ దంపతులు కడగుట్ట కవిత, శివశంకర్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయం నుంచి ఊరేగిస్తూ గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి వద్దకు తీసుకెళ్లి భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ఉత్సవాల్లో భాగంగా మంగళశారం హంస వాహన సేవలు నిర్వహించనున్నారు.

జనాదరణ ఓర్వలేక దాడి


దెబ్బ తిన్న వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార వాహనం

ఓడీచెరువు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న ఆదరణనుచూసి ఓర్వలేక, ఓడిపోతామనే భయంతో టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని పుట్టపర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో టీడీపీ ప్రచారానికి జనస్పందన కరువైంది. దీంతో ఆ పార్టీ నాయకులు బి.ప్రభాకరరెడ్డి, బి.గంగిరెడ్డి, జె.అంజినప్ప, ఎ.జయరామిరెడ్డితో పాటు దాదాపు 30 మందికి పైగా కార్యకర్తలు సోమవారం ఉదయం నల్లమాడ నుంచి ఓడీచెరువుకు వస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన ఎల్ఈడీ స్క్రీన్ ఉన్న ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కొట్టి గాయపరిచారు. వాహనంపై రాళ్లు రువ్వారు. కట్టెలతో అద్దాలు ధ్వంసం చేసి, ఫ్లెక్సీలు చించేశారు. విషయం తెలుసుకున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటమి భయంతో టీడీపీ నాయకుల్లో అసహనం ఎక్కువవుతోందన్నారు. వారి దాడులకు ఓటు సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

నగదు పట్టివేత


నగదును చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని పట్నం పోలీసు స్టేషన్ పరిధిలో 42వ జాతీయ రహదారిపై ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును ఎస్ఐ నరసింహులు, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారు జామున వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనంలో రఫీ, ఆంజనేయులు వద్ద ఎలాంటి రశీదులు లేని రూ.79,500, అలాగే ఐచర్ వాహనంలో కౌలేపల్లి అంజి నుంచి రశీదులు లేని రూ.4,55,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు


పుట్టపర్తి శివారులో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల వేళ జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధాన చెక్ పోస్టులతో పాటు రహదారుల ప్రధాన కూడళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లతో పాటు రహదారులపై సంచరిస్తున్న బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే వదులుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరలించే ప్రతి వస్తువునూ స్వాధీనం చేసుకుంటున్నారు.

టీడీపీ అభ్యర్థిని ఓడించండి

- వడ్డెర్ల సంఘం నాయకుల పిలుపు
- నామినేషన్ ఉపసంహరించుకున్న టీడీపీ రెబల్ అభ్యర్థి పోలన్నపై అసహనం


మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: టీడీపీ రెబల్‌గా ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ నామినేషన్ వేసిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన సిమెంట్ పోలన్న తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అంతకు ముందు పలువురు టీడీపీ నాయకులు పోలన్నతో సమావేశమై చర్చించారు. విషయం తెలుసుకున్న వడ్డెర్ల సంఘం నాయకులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి టీడీపీకి ఓటు వేయొద్దంటూ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో వడ్డెర్లకు పార్టీ టికెట్ ఇస్తామంటూ నమ్మబలికిన చంద్రబాబు.. చివరకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూరరెడ్డికి కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టికెట్ ఆశించి భంగపడ్డ వడ్డె సిమెంట్ పోలన్నకు వడ్డెర్లు అండగా నిలిస్తే సోమవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో గుట్టుచప్పుడు కాకుండా సమావేశమై రూ.10 లక్షలకు అమ్ముడుపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి మాట్లాడుతూ.. వడ్డెర్లు స్థిరంగా ఉండరని, వారు డబ్బుకు అమ్ముడుపోయే రకమంటూ కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. వారి వ్యాఖ్యలు నిజం చేస్తూ పోలన్న వడ్డెర్ల ఆత్మగౌరవాన్ని దారుణంగా దెబ్బతీశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వడ్డెర్లు మోసపోకుండా సంఘటితమై మంచి చేసే నాయకుడికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ టీడీపీకి ఓటు వేయరాదన్నారు. సమావేశంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండగుల మారెప్ప, తిరుపతేంద్ర, భాస్కర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


సురేష్ (ఫైల్)

ధర్మవరం రూరల్: నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం కోనంపల్లికి చెందిన ఎరికల సురేష్ (40) ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురంలో మంగళవారం జరిగే జ్యోతుల ఉత్సవానికి బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని నీటి గుంత వద్దకెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి పాచిలో చిక్కుకుని బయటకు రాలేక కొట్టుమిట్టాడసాగాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు సురేష్‌ని వెలికితీసి ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బొలెరో ఢీకొని ఒకరి మృతి

పెద్దవడుగూరు: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన నాగేషు(32) పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లిలోని బంధువుల ఇంటికి సోమవారం వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన క్రిష్టిపాడు సమీపంలో జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేషు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చంద్రబాబు ప్రజాధనాన్ని దోచిపెట్టారు

- గత ప్రభుత్వ హయాంలో తమ్ముళ్లకు మాత్రమే లబ్ధి చేకూర్చారు
- టీడీపీకి ఓటుతో బుద్ధిచెప్పాలన్న మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: ప్రజారంజక పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపురం, కొండంపల్లి, హనుమంపల్లి, మరువపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మతో కలసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంను చేయాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు తన సొంత కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు వర్తింపజేశారని విమర్శించారు. నీరు–చెట్టు పథకం పేరుతో సొంత పార్టీ కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచిపెట్టారన్నారు. దోచుకోవడం... దాచుకోవడంలో టీడీపీ మించిన నాయకులు ఏ పార్టీలోనూ లేరన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణ, గోపాల్ రెడ్డి, అంజినాయక్, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేష్, చిన్ని అంజి, గోవిందప్ప, రెడ్డప్ప, పెద్ద ఆంజినేయులు, శ్రీరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ


వైఎస్సార్‌సీపీ జెండా చేతపట్టుకొని రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుకొండ: పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఉషశ్రీచరణ్ ఉగాది క్యాలెండర్ ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రూపొందించడం హర్షణీయమన్నారు.

పెనుకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోమవారం పెనుకొండ మండలంలోని రాంపురం, కొండంపల్లి గ్రామాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ కులాల కార్పొరేషన్ డైరెక్టర్, చైర్మన్ల పరిశీలకుడు పులివెందుల ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉషశ్రీచరణ్‌తో కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లతో కలసి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ పకృద్దీన్, పాదయాత్ర నటేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఉషశ్రీచరణ్‌తో కలసి ప్రచారంలో పాల్గొన్న బీసీ కార్పొరేషన్ల కోఆర్డినేటర్ ప్రవీణ్

కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేదు...

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత కుటుంబానికే న్యాయం చేయలేని నాయకురాలని, ఇక.. నియోజకర్గ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఈ రాష్ట్రంలోనే కాదు.. పక్కరాష్ట్రంలో కూడా కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిని ఎన్నుకోవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీలకు రాజ్యాధికారం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయం గొప్పదన్నారు. మరోమారు పెనుకొండ కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా అందరూ ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలన్నారు.

క్లుప్తంగా

ఉషమ్మను గెలిపించండి


ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. సోమవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ సారథి జగనన్ను అండగా నిలవాలని కోరారు. అబద్ధపు హామీలు చెప్పే టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ సర్పంచ్ వేణు, ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు ఆదినారాయణ రెడ్డి, లక్ష్మిరెడ్డి, సజ్జారెడ్డి, అబ్దుల్ జమీల్ నరసింహమూర్తి, రామాంజి, శ్రీకాంత్, బాబు, నాగమణి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధి కోసం శ్రీధర్‌రెడ్డిని గెలిపించండి


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న రాఘవరెడ్డి


పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం వెంగళమ్మచెరువులో ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ కరపత్రాలను అందజేశారు. ఐదేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. మరో ఐదేళ్లు నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, ఇంటింటికీ సంక్షేమ పథకాలు రావాలన్నా శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, సర్పంచ్ వెంకటేషు, నాయకులు గంగాద్రి, పవన్ కుమార్, కన్యాకుమారి, రమణా రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

టీడీపీ మాయమాటలు నమ్మొద్దు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి

ఓడీచెరువు: ఆచరణ సాధ్యం కానీ హామీలిచ్చే టీడీపీ నేతల మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఉగ్గిరెడ్డిపల్లి, గౌనిపల్లి, చౌడంపల్లి, అల్లాపల్లిలో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం చేపట్టారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600కుపైగా హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. జగనన్న తాను ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి శ్రీధర్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనందరెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచు వెంకటరమణ, హనుమంత రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, వెంకటేశ్ ప్రసాద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

సోమందేపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13న జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్, తాగనీరు, వికలాంగులు ఓటు వేయడానికి వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజనాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు పట్టం కడదాం


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని ఓ వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

పుట్టపర్తి: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విశ్వసనీయతకు పట్టం కడదామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరారు. ఆయన సోమవారం బుచ్చయ్యగారిపల్లి, కడప నాగేపల్లి, నల్లగుట్టపల్లిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, బట్టల కేశప్ప(సర్పంచ్ మామ), సొసైటీ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రవి(సర్పంచ్ భర్త) ఆదెప్ప, గ్రామ సచివాలయ అధ్యక్షుడు లోసారి వెంకట్రాముడు, పోతిరెడ్డి, ఎల్ఐసీ చంద్ర, కర్నాటకం కేశవరెడ్డి, నల్లపరెడ్డి, భగవంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, సూరా రవీందర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, డీలర్లు రాజారెడ్డి, నాగేంద్ర, ఎస్సీ కాలనీకి చెందిన గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో నాగరాజు (40) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజుకు భార్య లలితమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా కుటుంబ కలహాలతో తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంటిలో పై కప్పుకు ఉరివేసుకొని నాగరాజు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


బాలిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చరణ్‌రెడ్డి

పరిగి: సంక్షేమ రాజ్యాన్ని సృష్టించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి కోరారు. మండలంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీ చరణ్, బోయ శాంతమ్మ గెలుపుకోసం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. బాలిరెడ్డిపల్లి, బోరెడ్డిపల్లి, విట్టాపల్లి గ్రామాలలో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకుల, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేసి, అఖండ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు.


చరణ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న మాజీ సర్పంచ్ రామకృష్ణ తదితరులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

పరిగి: మండలంలోని శిరేకోళం పంచాయతీ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌తో పాటూ మోదా, శ్రీరంగరాజుపల్లి, విట్టాపల్లి, ధనాపురం గ్రామాల్లో టీడీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలకు చెందిన దాదాపు 80 కుటుంబాలకు చెందిన వారు మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, కోఆప్షన్ మెంబర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా జగన్ పక్షమే

నల్లమాడ: బీసీలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్షమేనని వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు పేర్కొన్నారు. సుబ్బరాయునిపల్లికి చెందిన టీడీపీ నేతలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తన హయాంలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఒక్క పనీ చేయలేదన్నారు. తాను ప్రజల శ్రేయస్సు గురించి ఆలోచించాను కాబట్టే నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి సాధ్యమైందన్నారు. పార్టీలోకి చేరిన వారిలో నరసింహులు, లక్ష్మీనారాయణ, గంగులప్ప, శంకరప్ప, బాలకృష్ణ, శ్రీనివాసులు, సంతోష్, తిరుపాల్, ఓబుళేసు, గంగులప్ప, ఉత్తమ్మ, గంగన్న, వెంకటేష్, లక్ష్మీదేవి, శశికళ, సునీతమ్మ, రామలక్ష్మి, వారాదమ్మ, శివమ్మ, రమణమ్మ,సిద్దమ్మ, రాజు ఉన్నారు. అలాగే పులగంపల్లికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో కొండే చిన్నగంగిరెడ్డి, ఎం. నారాయణ రెడ్డి, చిన్న రెడ్డి, రాజారెడ్డి, జగదీశ్ చంద్రబోస్ రెడ్డి, కోటయ్య, జె.కళ్యాన్, మణికంట రెడ్డి, ఎ. ఆదినారాయణ ఉన్నారు.


పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

టీడీపీ నుంచి సొంతగూటికి..

అమడగూరు: మండలంలోని పూలకుంటపల్లికి చెందిన తొట్లి వెంకటరమణారెడ్డి సోమవారం టీడీపీని వీడి తిరిగి వైఎస్సార్‌సీపీలోకి చేరాడు. గత నాలుగు రోజుల క్రితం టీడీపీలోకి చేరాడు. అయితే అక్కడ ఇమడలేక కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీ పార్టీని వీడి తప్పు చేశానని, తప్పు తెలుసుకుని మళ్లీ సొంతింటికి వచ్చినందుకు అనందంగా ఉందన్నాడు. అమడగూరులోని చౌడేశ్వరీ కల్యాణమండపం వద్ద ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేర్చుకున్నారు. దూదరగుట్టకు చెందిన 10 కుటుంబాలు పుట్టపర్తిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి

జోరుగా ఎన్నికల ప్రచారం

రొద్దం: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వివరించారు, చంద్రబాబును నమ్మితే నట్టేట ముంచుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మారుతీనగర్‌లో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీధరన్నను మరోసారి గెలిపించుకుందాం

కొత్తచెరువు: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం మరోసారి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. సోమవారం వారు మండల కేంద్రంలోని బసవన్నకట్ట వీధి, పెద్ద మసీదు సర్కిల్, దర్గా సర్కిల్, బోయ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, పరిశీలకులు ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్ రాధనాగరాజు, జెడ్పీటీసీ మటన్‌శంకర్, టౌన్ కన్వీనర్ భాస్కర, నాయకులు అంగడి సోమశేఖర్‌రెడ్డి, అంగడి సత్తి, కాపు సంఘం నేత దాల్‌మిల్‌సూరి, షాన్‌షేట్, ఉపసర్పంచ్ యుగంధర, పాదయాత్ర వాల్మీకి శంకర్, ఆవుల అశోక్, ప్రభావతమ్మ, ఎల్లప్ప, వెంకటరాముడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి: మండల కేంద్రం పరిగిలో ఐదు రోజుల క్రితం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన బోయ వెంకటేశులు (42) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ వివరాలమేరకు... పరిగి బోయపేటకు చెందిన చౌడప్పకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో సంతానంగా ఉన్న వెంకటేశులుకు ఇప్పటి వరకూ పెళ్లి కాలేదు. ఈనెల 19న తండ్రి అతని చనిపోయాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని వెంకటేశులు ఈనెల 24న ఇంట్లోని షుగర్ మాత్రలను మోతాదుకు మించి వేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఓటు సద్వినియోగం చేసుకోవాలి



ఓటు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఓటు హక్కుపై అవగాహన కలిచే నిమిత్తం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు ఫ్రైడ్ టు బీఏ ఓటర్ అన్న నినాదంతో సంతకం చేసి ఓటు వినియోగించుకోవాలని నినదించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


గోకులంలో ప్రచారం నిర్వహిస్తున్న అపర్ణారెడ్డి

పుట్టపర్తి రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కొనసాగేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం ఆమె పట్టణంలోని గోకులం ఎనుములపల్లి గణేష్ సర్కిల్లో వార్డులలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. నియోజవర్గ అభివృద్ధి కోసం మరోసారి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం

పెనుకొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని జీబీసీ కాలనీ, గడంగి వీధిలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రఘునాథరెడ్డి, తోటగేరి ప్రాంతంలో కౌన్సిలర్ నాగరత్న, రేపటి గణేష్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, పట్టణ కన్వీనర్ బోయ నరసింహా, గురురాజ్, , నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, శేషాద్రి, రామాంజినేయులు, ముఖ్యనాయకులు జయశంకరరెడ్డి, వెంకటేష్, కొండలరాయుడు, శంకరరెడ్డి, నాయుడు, నేమత్, కిరణ్, మల్లికార్జున, మున్నీర్, సిక్బతుల్లా, వెంకటరాముడు, అంజినేయులు, బోయబాబు, వజ్రం వెంకటేష్, సిక్బతుల్లా, ఫరీద్, కృష్ణారెడ్డి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.


జీబీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్నికల బరిలో 9 మంది అభ్యర్థులు

పెనుకొండ: పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే బరిలో 9 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 25 నామినేషన్లు దాఖలు కాగా 11 మంది అభ్యర్థులు ఈ నామినేషన్లు వేశారు. స్క్రూట్నీలో 1 నామినేషన్ తిరస్కరణకు గురయ్యింది. 10 మంది అభ్యర్థులు బరిలో నిలవగా అందులో నరేంద్ర అనే స్వతంత్ర అభ్యర్థి సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ తరపున ఉషశ్రీచరణ్, టీడీపీ తరపున సవిత తదితరులు బరిలో ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న బోయ అంజి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో కర్ణాటక మద్యం తరలిస్తున్న అంజి వద్ద నుంచి 96 కర్ణాటక టెట్రా మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖర్చుల వివరాలు అందజేయాలి

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలను వెంటనే సంబంధిత సిబ్బందికి అందజేయాలని ఎన్నికల అధికారులు తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులు ఎన్నికల ఖర్చులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను అభ్యర్థులకు వివరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఓడీచెరువు మండలం ఎద్దులవాండ్లపల్లికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పుట్టపర్తిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పొగాకు రియాజ్, రషీద్,హైదర్‌వలి, ధర్మవరం రాజా, షేక్షా, చిట్టి బాబు, వెంకటలక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ, గాయత్రీబాయి, వసంతబాయి, సావిత్రిబాయి, లక్ష్మిదేవి, మహేష్ తదితరులు ఉన్నారు.